

అబ్బూరి ఛాయాదేవి

**2**

# ప్రథమస్థానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక వ్యాపారసంస్థ ఏర్పాటు చేసిన టి.వి. కార్యక్రమం అది. మధ్యాహ్నం మూడు గంటలకి మొదలవుతుంది. ఎనిమిది మంది మహిళలు - అందరూ సామాన్య గృహిణులే. వారిలో ఒకరిని 'గొప్ప గృహిణి'గా ఈ కార్యక్రమంలో ఎంచుకోవడం జరుగుతుంది. ఎంపికైన గొప్ప గృహిణికి ఆ వ్యాపారసంస్థ తరపున ఒక పెద్ద బహుమతి ఇచ్చి సత్కరిస్తారు. ఎంపిక చేయడానికి ముగ్గురు ప్రఖ్యాత మహిళలు ఉన్నారు. వారిలో ఒకామె ప్రముఖ రచయిత్రి, మరొకామె సమాజసేవలో అనుభవజ్ఞురాలు, ఇంకొకామె ప్రముఖ న్యాయవాది. చాలా అందంగా, చలాకీగా ఉన్న ఒక యువతి ఆ పోటీ కార్యక్రమాన్ని నిర్వహించడం మొదలుపెట్టింది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ అభినందనలు తెలియజేసి, పోటీకి న్యాయనిర్ణేతలుగా వచ్చిన ప్రముఖ మహిళలు ముగ్గురినీ పరిచయం చేసి, వారికి స్వాగతం పలికింది ఆ సుందరి. ఆ తరువాత, పోటీలో పాల్గొనడానికి వచ్చిన గృహిణులకు స్వాగతం, శుభాకాంక్షలూ తెలియజేసి,

వారిని స్వయంగా పరిచయం చేసుకోమని కోరింది. ఆ తతంగం పూర్తి అయాక, ఒక్కొక్కరినే వాళ్ళు గత సంవత్సరంలో సాధించిన ఘనకార్యం ఏదైనా ఉంటే చెప్పమని కోరింది. "అది మహిళల అస్తిత్వానికీ, గృహంలోనూ, సమాజంలోనూ ఆమెకున్న స్థానానికీ సంబంధించినదై ఉండాలి" అని స్పష్టం చేసింది.

"మొట్టమొదట ప్రభావతిగారు తమ జీవితంలో గత సంవత్సరంలో సాధించిన ఘనకార్యం గురించి చెబుతారు" అంది సుందరి మందహాసంతో.

"మా పెళ్ళయి ఇరవై ఏళ్ళయింది. ఇన్నాళ్ళూ గృహిణిగా నా బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చాను. పిల్లలు చదువుల్లో పైకొస్తున్నారు. వాళ్ళ కోరికలూ, అవసరాలూ పెరుగుతున్నాయి. అనవసరంగా ఖర్చులు పెంచడం ఎందుకనీ, ఆయనకి ఇబ్బంది కలిగించడం ఎందుకనీ ఎప్పటికప్పుడు నా కోరికల్ని అదుపులో పెట్టుకుంటూనే ఉన్నాను. చీటికీ మాటికీ ఆయన ముందు చెయ్యి చాచడానికి నాకు అభిమానం అనిపిస్తోంది. అందుకే నేనూ ఉద్యోగం చెయ్యాలని నిశ్చయించుకున్నాను. మావారు వద్దంటున్నా నచ్చజెప్పి, 'టీచర్స్ ట్రెయినింగ్ కోర్స్' చేశాను. ఈమధ్యనే మా ఇంటికి కాస్త దూరంలో ఉన్న ఒక ప్రైవేట్ స్కూల్లో ఉపాధ్యాయినిగా చేరాను. ఆయనకొచ్చే జీతం ముందు నాది చాలా తక్కువే అయినా, నాకిప్పుడెంతో తృప్తిగా ఉంది" అని చెప్పింది ప్రభావతి.

అందరూ చప్పట్లు కొట్టారు.

"ఇప్పుడు సుజాతగారు ఏం చెబుతారో విందాం" అంది సుందరి ఉత్సాహంగా.

"ఓసారి నేను మా ఇంటి ఆవరణలో తిరుగుతుండగా, 'ఏదైనా తినడానికి ఉంటే పెట్టండమ్మా' అని దీనంగా అడిగింది ఒక పడుచుపిల్ల. గేటు దగ్గర నిలబడి దీనంగా పిలుస్తోంది. ఎవరు నువ్వు? వయస్సులో ఉన్నావు. ఏదైనా పని చేసుకోలేవా, ముష్టి అడుక్కోవడమేమిటి అని కోప్పడ్డాను. 'మా అమ్మ చచ్చిపోయింది జబ్బుచేసి. మా నాన్న తాగుబోతు. అడుక్కుతినైనా డబ్బులెమ్మని బెదిరిస్తున్నాడమ్మా' అంది. నువ్వు నిజమే చెబుతున్నావా? అన్నాను. 'ఒట్టమ్మా' అంది. ఎక్కడైనా కూలిపని చేసుకోవచ్చుకదా అన్నాను. "చేశానమ్మా. అక్కడ అందరూ నా మీద కన్నేసేవోళ్ళే. ఎలా తప్పించుకు బతకాలో తెలియడం లేదమ్మా. ఏదైనా పనుంటే చెప్పండమ్మా, చేస్తాను" అంది. అందాకా తోటలో పని చెయ్యమన్నాను. నమ్మకం కుదిరాక మెల్లిగా ఇంట్లో పనులు కూడా చేయిస్తున్నాను. ఇప్పుడా అమ్మాయి అడుక్కోవడం మానేసింది" అని చెప్పింది సుజాత.

అందరూ చప్పట్లు కొట్టారు.

"ఇప్పుడు రాధికగారు తమ అనుభవం గురించి చెబుతారు" అంది సుందరి మందహాసంతో.

"మా ఆయన అన్ని విధాలా మంచాయనే. ఒక్కటే బలహీనత ఆయనకి – తాగుడు. మొదట్లో అప్పుడప్పుడు పార్టీల్లో కొంచెం తాగి వచ్చేవారు. తరువాత స్నేహితుల్తో బయటికి వెళ్ళి తాగి వస్తూండేవారు. ఎందుకు డబ్బు తగలేస్తారు? ఆరోగ్యం కూడా పాడుచేసుకుంటున్నారు అని కోప్పడ్డాను. కానీ పట్టించుకోలేదు. ఇంటికి ఆలస్యంగా రావడం, పిల్లలతో కూడా సమయం గడపకపోవడం నాకు నచ్చట్లేదన్నాను. అప్పుడు ఇంట్లో తాగడం మొదలుపెట్టారు. ఆయన్ని ఎలా దారిలో పెట్టాలా అని ఆలోచించాను. ఆయన ఇంటికి తిరిగి వచ్చే సమయానికి పడగ్గదిలో బల్లమీద సీసా, గ్లాసూ పెట్టి, పక్కన పకోడీలు కూడా పెట్టుకుని కూర్చున్నాను. గ్లాసులో మందు పోసి ఉంచాను. పిల్లలు వాళ్ళ గదిలో చదువుకుంటున్నారు పరీక్షలకి. ఆయన ఆలస్యంగా వచ్చి 'బెల్' నొక్కితే నేను వెళ్ళలేదు. కొంచెంసేపు చూసి మా అబ్బాయి వెళ్ళి తీసినట్టున్నాడు. ఆయన పడగ్గదిలో కొచ్చి నా వాలకం చూసి నిర్ఘాంతపోయారు. నేను నవ్వుతూ, ఆయన్ని ఇంకో గ్లాసు తెచ్చుకోమన్నాను. ఇవ్వాళ మన 'పెళ్ళిరోజు' గదా, రండి, పండగ చేసుకుందాం అన్నాను. ఆయన తన తప్పు గ్రహించి, క్షమించమన్నారు. మళ్ళీ ఆయన తాగలేదు అని అనను కాని, తగ్గించారు" అని ముగించింది ముసిముసిగా నవ్వుతూ.

అందరూ చప్పట్లు కొట్టారు.


"ఇప్పుడు ప్రేమలతగారు ఏం చెబుతారో విందాం" అంది సుందరి కొంటెగా నవ్వుతూ.

"నేను మా ఇంట్లో వంటింటి మహాలక్ష్మిని – సగటు గృహిణుల్లాగానే. మా అత్తగారికి లేక లేక కలిగిన సుపుత్రుడు మావారు. అంచేత అతి గారాబంగా పెంచారు. మంచినీళ్ళు కూడా గ్లాసులో పోసి ఎవరైనా అందిస్తేనే తాగుతారు. దానికి తోడు నాకు ఇద్దరూ మగపిల్లలే. తండ్రిని చూసి వాళ్ళు 'మగపనులు' తప్ప చేసేవారు కాదు. 'ఆడపనులు' చెయ్యాలంటే నామోషీ. పూర్వకాలపు స్త్రీలు కనీసం నెలకి మూడు రోజులైనా విశ్రాంతి తీసుకునేవారు వంటింటివైపు రాకుండా. ఇప్పుడు నాగరికత పెరిగి ఆధునిక గృహిణికి నెలకి ఒక్క రోజు కూడా సెలవు దొరకడం లేదు. ఆదివారాలు మరింతపని. ఇది పని కాదని, ఒక ఉపాయం ఆలోచించాను. ఒంట్లో నలతగా ఉందని, లేడీ డాక్టర్ దగ్గరికి వెళ్ళాను. ఆవిడ చేత మందులతోపాటు చీటీలో మూడు రోజుల 'బెడ్ రెస్ట్' అని కూడా రాయించాను. అయినా, పిల్లలూ భయపడ్డారు. బ్రెడ్ తెచ్చుకుని ఊరగాయ, పెరుగుతో వాళ్ళు తిని, నాకూ పెట్టారు. పనిమనిషి సాయంతో ఆ మూడు రోజులూ ఎలాగో నానా తంటాలూ పడ్డారు. నా వైద్యం పూర్తయి, వంటింట్లో ప్రవేశించాక మెల్లిగా వంటింటి పనుల్లో సాయం చెయ్యడం మొదలుపెట్టారు. పనులు ఎలా చెయ్యాలో నేర్చుకున్నారు. ఇప్పుడు నన్ను వాళ్ళు కేవలం ఆడమనిషిలాగా కాకుండా మనిషిగా చూస్తున్నారు" అంది ప్రేమలత సగర్వంగా.

అందరూ చప్పట్లు కొట్టారు నవ్వుతూ.

సుందరి కిలకిలా నవ్వి, "ఇప్పుడు సమతగారు తమ అనుభవం గురించి చెబుతారు" అంది.

"నేను బాగా చదువుకున్నదాన్నే అయినా కేవలం గృహిణిగానే ఉంటున్నాను. నాకు సమాజసేవ చెయ్యడం ఇష్టం కాని, కుటుంబ బాధ్యతల వల్ల కుదరడం లేదు. కులాంతర వివాహం చేసుకుంటానంటోందని, మా బంధువుల్లో ఒకరు వాళ్ళమ్మాయిని ఇంట్లో నుంచి బయటికి వెళ్ళకుండా హింసిస్తూంటే,




కార్టూన్ల పోటీలో తృతీయ బహుమతి పొందిన కార్టూన్

ఎన్.వి. రమణమూర్తి, విజయవాడ, కృష్ణాజిల్లా.

వాళ్ళకి నచ్చజెప్పి ఆ వివాహం దగ్గరుండి జరిపించాను పెద్దవాళ్ళ సమ్మతితోనే" అని చెప్పింది సమత.

అందరూ చప్పట్లు కొట్టారు.

"ఇప్పుడు వర్ధనిగారు ఏం చెబుతారో విందాం" అంది సుందరి.

"నేనూ సామాన్య గృహిణినే. చదువుకున్నదాన్నే అయినా, ఉద్యోగం చెయ్యవలసిన అవసరం లేదన్నారు మావారు. సంతోషంగానే కాలం గడుపుతున్నాను. కొన్నినెలల కిందట ఒక సంఘటన జరిగింది. భర్త వదిలేశాడని, నలుగురిలో తలెత్తుకోలేనంటూ ఆత్మహత్యకి ప్రయత్నించి విఫలమైన మా బంధువు ఒకావిడకి ధైర్యం చెప్పి, ఉద్యోగం చెయ్యమని ప్రోత్సహించాను. చిన్నప్పుడు సరదాగా ఇంట్లోనే టైపు నేర్చుకుంది కనుక ఇప్పుడు కంప్యూటర్ ట్రెయినింగ్ అవమని చెప్పి, కావాల్సిన సదుపాయాలు చేశాను. ఆడదానికి తన కాళ్ళమీద తను నిలబడగల స్తోమత ఎంత అవసరమో గ్రహించాను" అని వర్ధని చెప్పగానే అందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు.

"ఇప్పుడు సుమతిగారు తమ విశిష్ట అనుభవం గురించి చెబుతారు. ఏం చెబుతారో విందాం" అంది సుందరి మందహాసంతో.

"నేను మంచి గృహిణిని అని బంధుమిత్రుల మెప్పు పొందాను. నేను అంత అనాకారిని కానుకదా!..." అందరూ ఉలిక్కిపడి చూశారు ఆవిడ మాటలకి. "భార్య ఎంత మంచిగా ఉన్నా, బావున్నా, భర్తలకి పరస్త్రీల మీద దృష్టి ఎందుకు పోతుందో తెలియదు! మావారు ఉద్యోగరీత్యా టూర్లకు వెడుతూంటారు. అక్కడ ఏం చేసేవారో నాకు తెలియదు. ఈమధ్య ఇక్కడ 'కాల్‌గర్ల్స్'తో తిరుగుతున్నారని నాకు కబుర్లు తెలిశాయి. ఆయన్ని మొహం మీద అడగడానికి నాకే అభిమానం అడ్డొచ్చింది. ఆయన్ని ఎలా దారిలోకి తీసుకురావాలా అని ఆలోచించాను. ఆ రోజు నా పుట్టినరోజు. ఆయనకి గుర్తులేదు. నేనూ చెప్పలేదు. కానీ సాయంకాలం సరదాగా ఎక్కడికైనా వెడదాం, తొందరగా రండి, ఇవ్వాళ ఒక ప్రత్యేకదినం అన్నాను. "సారీ, నేను సాయంకాలం వేరేచోటికి వెళ్ళాలి, ముందే ఏర్పాటైంది. రాత్రి కొంచెం ఆలస్యం అవుతుంది నేను వచ్చేసరికి" అన్నారు. సాయంకాలం ఆఫీసు నుంచి వస్తూనే దుస్తులు మార్చుకుని ఘుమఘుమలాడుతూ బయటికి వెళ్ళిపోయారు. నాకు విరక్తి కలిగినట్లయింది. ఓ కాగితం మీద "నేను ఇంట్లోంచి వెళ్ళిపోతున్నాను. నా కోసం వెతక్కండి" అని పెద్ద అక్షరాలతో రాసి ముందు గదిలో బల్లమీద కాగితాన్ని పెట్టి, చిన్న సంచిలో ఒక పూటకి సరిపడ బట్టలు సర్దుకుని, పక్కవీధిలో ఉన్న నా స్నేహితురాలింటికి వెళ్ళి చూద్దాం అనుకుని తలుపు గడియతీసి బయలుదేరబోతున్నాను. వాకిట్లో ఆయన 'హోండా' చప్పుడు వినిపించింది. ఏదైనా మరిచిపోయి తిరిగి వచ్చారేమో అనుకుని, గబుక్కున పెద్ద సోఫా వెనకాల నక్కి కూర్చున్నాను. ఆయన తలుపు తెరుచుకుని లోపలికి వచ్చి నన్ను పిలిచారు. నేను పలకలేదు. ఎదురుగా చిన్న బల్ల మీద పెట్టి ఉన్న కాగితం మీద ఆయన దృష్టి పడింది. అది తీసి చదివారు. తల రెండు చేతుల్తో పట్టుకుని సోఫాలో కూలబడ్డారు. నేను కదల్లేదు. ఆయన అంతలోనే లేచి, వెనక గోడ మీద ఉన్న దేవుడి బొమ్మకి దణ్ణం పెడుతూ, "ఇంకెప్పుడూ ఇలాంటి పాపం చెయ్యను. సుమతి త్వరగా క్షేమంగా తిరిగి వచ్చేటట్లు చెయ్యి తండ్రీ, మా కుటుంబం పరువు నిలబెట్టు స్వామీ" అని ప్రార్థించారు. నేనింక ఉండబట్టలేక, సోఫా వెనక నుంచి లేచి వచ్చి నవ్వుతూ నిలబడ్డాను. నన్ను చూసి "ఎంత మోసం!" అన్నారు. "మీరు చేసినదానికన్నానా?!" అన్నాను" అని చెప్పింది సుమతి.

అందరూ చప్పట్లు కొట్టారు ఉత్సాహంగా. సుందరి మరింత గట్టిగా చప్పట్లు కొట్టి పకపకా నవ్వుతూ ఒక క్షణం ఆగి, "ఇప్పుడు సుగుణగారు తను సాధించిన ఘనకార్యం గురించి చెబుతారు, విందాం" అంది.

"మావారు ప్రభుత్వోద్యోగి. మంచిజీతం వస్తుంది. మగపిల్లలకి మంచి చదువులు చెప్పించాం. పెద్దమ్మాయి పెళ్ళి చేశాం. పెద్దవాడికి బ్యాంకులో ఉద్యోగం. చిన్నవాడు ఎం.ఎస్. చెయ్యడానికి అమెరికా వెళ్ళాలని తపనపడుతున్నాడు. అంత డబ్బు ఎలా సర్దుబాటు చెయ్యడమా అని ఆయన సతమతమవుతున్నారు. ఉన్న చిన్న చిన్న స్థలాలు ఇదివరకు అవసరాలకు అమ్మేశాం. పిల్లకి పురుడుపొయ్యాలి - ఆ ఖర్చులున్నాయి ఇంకా. ఆ రోజుల్లోనే ఒకనాడు ఆయన ముందుగదిలో ఎవరో పెద్ద మనిషితో మాట్లాడుతున్నారు. ఎవరైనా స్నేహితుడేమో, టీ పట్టుకెళ్ళి ఇవ్వాలేమోనని ఓసారి తొంగిచూశాను. నాకు ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ దర్జాగా గట్టిగా మాట్లాడే ఆయన ఆ వచ్చిన కొత్తమనిషితో అంత నెమ్మదిగా మాట్లాడుతున్నారేమిటి అని. కొంతసేపటికి అతను వెళ్ళిపోయాక, మా ఆయన లోపలికొచ్చి పడగ్గదిలో ఇటూ అటూ పచార్లు చేస్తున్నారు. ఏమిటి అంత ఇదిగా ఆలోచిస్తున్నారు? అన్నాను. "ఏంలేదు" అన్నారు ముక్తసరిగా. అతనెవరు?

# ఏదో ఒకటి

## శివారెడ్డి

ఏదో ఒకటి
దొరికిం దాన్ని జేబులో వేసుకు
వెళ్ళటం అలవాటయ్యాక
అంతగా దరిద్రం లేదు
ఇదికావాలని ఏం లేదు
దొరికిందే నాది
వెతుకులాట వుంటుంది
వేలవేల కొరడాదెబ్బతో వుంటాయి
బిక్షార్థిగా
ఎక్కే గడపా, దిగే గడపా -
వేసారటమూ లేదు, విసుగు చెందటమూ లేదు
రెండు పోతాయి, ఒకటి దొరుకుతుంది
ఒకటి పోతుంది. నాలుగు దొరుకుతాయి
దాలిగుంటలో
ఉలవ గుగ్గిళ్ళు ఉడికినట్టు ఉడకటమే -
ఏదీ పాతదిగాదు
కవిత్వం పాశారముక్క గాదు -
అడవిలో సూర్యోదయ మవటంలో
వింత ఏముంది
పరమరద్దీలో నడిరోడ్డు మీద
చంద్రోదయమౌతుంది
పట్టపగలు వెన్నెలలు కురుస్తాయి
తడిసినప్పుడే తనివి తీరుతుంది
విశాల ప్రపంచంలో రాక్షసరాజ్యంలో
దేన్నీ అశ్రద్ధ చేయకూడదు
నెత్తురుకూడు తినిపించే నేతలున్నప్పుడు
ప్రతిదాన్నీ పట్టపట్టి చూడాలి-

మీరు అంత రహస్యంగా మాట్లాడుతున్నారు? అన్నాను. "నీకెందుకు, నీకు తెలియదు, ఊరుకో" అన్నారు. నేను ఊరుకోలేదు. చెప్పండి దయచేసి. నాకు తెలియకుండా అంత రహస్యం ఏమిటి? అన్నాను.. "ఏదో వంతెన కాంట్రాక్టు గురించిలే" అన్నారు. ఆఫీసులో కాకుండా ఇక్కడ కెందుకొచ్చాడు? లంచ మివ్వడానికి చూస్తున్నాడా? అన్నాను. "ఆడదానివి, నీకెందుకవన్నీ" అన్నారు కసిరినట్లు. ఆడదాన్నైనా మన కుటుంబాన్ని నడపడంలో నాకూ భాగముంది. సమాజంలో కుటుంబం ఒక భాగం. ప్రభుత్వం ప్రజలది, ప్రజల కోసం. నాకూ బాధ్యత ఉందనుకుంటున్నాను. మీరు లంచం తీసుకోవడం నాకు ఇష్టం లేదు. మనం ఉన్నదాంట్లో తృప్తిగా ఉన్నాం. ఇప్పుడెందుకు ప్రలోభపడుతున్నారు? దయచేసి అటువంటి పని చెయ్యకండి. లేకపోతే నేను ఊరుకోను అన్నాను. ఏమనుకున్నారో, సెల్‌లో ఎవరికో ఫోన్ చేసి, "సారీ, కుదరదండీ నాకు. మనం మాట్లాడుకున్నవన్నీ మరిచిపొండి" అన్నారు. నేను తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను. మా కుటుంబంలో అందరం నిశ్చింతగా ఉన్నాం. మా రెండో అబ్బాయి అమెరికా ఆలోచన మానుకున్నాడు. మంచి ఉద్యోగంలో చేరాడు" అని ముగించింది సుగుణ.

అందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు. సుందరి చేతులు పైకెత్తి జోరుగా చప్పట్లు కొట్టింది.

న్యాయనిర్ణేతలు ముగ్గురూ కొంచెం సేపు గుసగుసలాడుతూ చర్చించుకున్నారు. సుందరి వాళ్ళవైపుకి తిరిగి, "ఇప్పుడు మీరు దయచేసి చెప్పండి. మీరు ఏ నిర్ణయానికొచ్చారో" అంది వినయంగా చిరునవ్వు నవ్వుతూ.

న్యాయనిర్ణేతలు ముగ్గురిలోనూ పెద్దావిడైన సంఘసేవా పరాయణురాలు ముగ్గురి తరఫునా వారి నిర్ణయాన్ని తెలియజేయడానికి నిశ్చయించుకున్నారు.

"అందరిలోకీ ఆఖరి ఇద్దరికీ మార్కులు ఎక్కువగా వచ్చాయి. వారిద్దరిలో సుగుణగారిని ప్రథమస్థానంలో ఎంపిక చేశాం. సుమతిగారికి ద్వితీయస్థానం లభించింది. సుమతిగారు చేసిన ప్రయత్నం గొప్పదే. అయితే, అందువల్ల ఆమె లాభం పొందడంతోపాటు, భర్తని సరిదిద్దింది, అంతే. అది వాళ్ళిద్దరికే ముఖ్యంగా పరిమితమైంది. ప్రథమస్థానం పొందిన సుగుణగారు చేసిన పని తన భర్తకీ, తన కుటుంబానికీ మేలు చేసేదే కాకుండా, సమాజానికి కీడు జరక్కుండా కూడా చేసిన గొప్ప పని. ఈనాడు దేశమంతా అవినీతిమయం అయిపోయిందని అందరూ ఘోషిస్తున్నారు. అయినా ఎవరూ తమంతట తాము అడుగు ముందుకి వెయ్యడం లేదు. ఒక సామాన్యగృహిణి ఒక పౌరురాలిగా బాధ్యతతో తన భర్తని సరిదిద్దడంతోపాటు, ప్రభుత్వమూ, ఎంతో మంది ప్రజలూ నష్టపోకుండా తనవంతు కృషి చేసింది. విలువలు పాటించడంలో మార్గదర్శకురాలైంది. ఆ విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఆలోచిస్తే దేశం బాగుపడుతుంది కదా!" అంటూ,

"ఇప్పుడు సుగుణగారు 'గొప్పగృహిణి' సత్కారాన్ని అందుకుంటారు. ఆమెకి మా అందరి తరఫునా అభినందనలు!" అన్నారు ఆవిడ.

అందరూ హర్షధ్వానాలు చేశారు.

